క్లుప్తంగా

సజావుగా టెట్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్ -2024 పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. ఈ నెల 21వ తేదీతో పరీక్షలు ముగియనున్నాయి. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రంలో ఆదివారం రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించారు. మొదటి విడతలో 171 మందికి 153, రెండో విడతలో 170 మందికి 157 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షలు పర్యవేక్షించారు.

పల్లెపండగను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రామకృష్ణ

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో గుంటుముక్కల రామకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక కార్యలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 14న చెట్టుపొదిలాం, కప్పరాం, మధుపాం, వెలగాడ, 15న మెట్టవలస, సీతంపేట, మర్రివలస, పెంట, 16న నిద్దాం, ఎస్.పి.ఆర్.పురం, గొబ్బూరు. జి.సిగడాం, 17న వాండ్రంగి, ఆనందపురం, టీడీవలస. సంతవురిటి, 18న దేవరవలస, ఎస్.భీమవరం, నడిమివలస, ఎందువ, 19న గెడ్డకంచరాం, బాతువ, పున్నాం, డి.ఆర్.వలస, 20న వెంకయ్యపేట, జగన్నాధవలస, జాడ, ముషినివలస పంచాయితీల్లో కార్యక్రమం ఉంటుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


కిల్లారి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

రణస్థలం: కొండములగాం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కె.కన్నంనాయుడు తల్లి సత్యమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కన్నంనాయుడు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అలాగే లంకపేట గ్రామానికి చెందిన ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షులు కిల్లారి రమణ భార్య సరస్వతి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆమెను కూడా పరామర్శించి త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శలో వైఎస్సార్ సీపీ నాయకులు మహంతి సత్యనారాయణ, గొర్లె శ్రీనివాసరావు, కిల్లారి సూర్యనారయణ, సన్యాసినాయుడు, అప్పలనాయుడు, కొత్తకోట్ల పర్సినాయుడు, లంక అసిరినాయుడు ఉన్నారు.

మణిపాత్రునికి కళాసేవ పురస్కారం


పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కల్చరల్ : అరసవల్లికి చెందిన మణిపాత్రుని నాగేశ్వరరావు కళాసేవలో విశేష సేవలందిస్తున్నందుకు గాను ఉత్తమ కళాసేవ పురస్కారంతో శనివారం సత్కరించారు. ఆమదాలవలస రోటరి క్లబ్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని సత్కారం చేశారు. చిత్రలేఖనం, సంగీతం, గానం, తబలా వాయిద్యంలో ఎంతో మంది విద్యార్థులకు ఈయన శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షురాలు పల్లె తేజలక్ష్మి, సినీ గాయకుడు కుప్పిలి గోపికృష్ణ, ఎంసీఏ ప్రతినిధులు కె.మధుబాబు, ఎం.టి.వి.ఆర్.మూర్తి, పాత్రునివలస సర్పంచ్ అప్పలనాయుడు, పంచిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పలకలు


పలకలపై ఏర్పాటు చేసిన డ్రమ్ము

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిరంతరం వేలాది మంది రాకపోకలు సాగించే రిమ్స్ ఆస్పత్రి రోడ్డులో పలకలు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ కాలువలను శుభ్రం చేసి వంద రోజులు గడిచినా తిరిగి సక్రమంగా ఏర్పాటు చేయలేదు. అస్తవ్యస్తంగా పడేయడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో స్థానికులు స్పందించి ప్రమాద సూచికగా కర్రకి గుడ్డ కట్టి పాతిపెట్టారు. అయినా ప్రమాదాలు ఆగకపోవడంతో ఏకంగా వాటర్‌డ్రమ్ పెట్టేశారు. ఇంత జరుగుతున్న కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్డులో అత్యవసర పరిస్థితుల్లో ఉండే రోగులను నిరంతరం అంబులెన్స్‌లో తరలిస్తుంటారు. వారంతా ఈ ప్రదేశానికి వచ్చేసారికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

బట్టేరు..దోపిడీకి స్కెచ్ వేశారు!

- ఇసుక అనుమతులు బట్టేరువి.. తోడేది నైరా, పొన్నాం సరిహద్దుల్లో..!
- అక్రమ తవ్వకాల కోసం తెలుగు తమ్ముళ్ల ఎత్తుగడ
- రాళ్లు..నీళ్లుతో ఉన్న బట్టేరులో తవ్వకాలకు అనుమతులపై విస్మయం
- వాల్టా చట్టానికి తూట్లు


రాళ్లు, నీటితో ఉన్న బట్టేరు నదీతీర ప్రాంతం

శ్రీకాకుళం రూరల్: బట్టేరు ర్యాంపు పేరిట ఇసుక దందాకు తెరలేవనుంది. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతం బట్టేరులో ఇసుక నిల్వలు అంతగా లేవు. ఓవైపు మోకాల్లోతు నీరు.. మరోవైపు రాయిరప్పలతో ఈ ప్రాంతం కనిపిస్తుంది. అలాంటి ఈ గ్రామం పరిధిలో ఇసుక తవ్వకాల కోసం టెండర్లను ఆహ్వానిస్తూ ర్యాంప్ ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం అనుమతులు మంజూరు చేసింది. వాస్తవానికి ఇక్కడ ఇసుక కావాలంటే నదిలోంచి దిగి కొన్ని కిలోమీటర్ల వరకూ వెళ్తేనే ఇసుక మేటలు కనిపిస్తాయి.

అంతా తమ్ముళ్ల ఎత్తుగడ..

తెలుగుదేశం పార్టీ నాయకులు సొమ్ములు చేసుకునేందుకు కొత్త ఎత్తుగడలకు తెరలేపారు. వాస్తవంగా బట్టేరులో ఇసుక లేకపోయినా దాన్ని అనుమతులుగా చూపిస్తూ పక్క ప్రాంతాలను నుంచి ఇసుక తోడేందుకు మాస్టర్ స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. కేవలం బట్టేరును మాత్రమే ఇసుక ర్యాంప్‌గా చూపించి పొన్నాం, నైరా ప్రాంతం నుంచి ఇసుకను తోడేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. పొరపాటున నైరా ప్రాంతాన్ని ఇసుక ర్యాంప్‌లుగా చూపిస్తే పక్కనే ఉన్న గిల్ కంపెనీ గ్యాస్ పైపులైన్లకు ఆటంకాలు ఎదురవుతాయి. పొన్నాం ప్రాంతం నుంచి అనుమతులు కోరినా రెవెన్యూ అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇచ్చే అవకాశం లేదు. ఎందుకంటే ఇదంతా ముంపు ప్రాంతం.

స్థానికులను సంప్రదించకుండానే..

వాస్తవంగా బట్టేరు మీదుగా ట్రాక్టర్లు తిరిగితే దుమ్ము, ధూళి చెలరేగి సమీప ఎస్సీ కాలనీపై పడుతోంది. అయినా కనీసం గ్రామస్తులను సంప్రదించకుండా, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా బట్టేరు గ్రామాన్ని ర్యాంప్‌గా చూపిస్తూ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారో తెలియడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి చొరబడి ఇసుకను తోడేస్తే వాల్టా చట్టానికి తూట్లు పొడవడమే కాకుండా పర్యవరణ పరిరక్షణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదముంది.


బట్టేరు మీదుగా నదిలోకి వెళ్లేందుకు దారి

కనీసం డ్రింకింగ్ వాటర్, ఇరిగేషన్, పర్యావరణ శాఖాధికారులు ఏ ఒక్కరూ బట్టేరు నదీపరివాహక ప్రాంతాన్ని సందర్శించిన దాఖలాలు లేవు.

ప్రయత్నాలు చేస్తున్నాం..

బట్టేరు ప్రాంతంలో ఇసుక ర్యాంప్ లేదు. మోకల్లోతు వరకూ నీరు ఉండడం వాస్తవమే. ఇసుక తేవాలంటే కొన్ని ఇబ్బందులు పడాల్సిందే. పక్క గ్రామాలు మీదుగా ర్యాంపునకు తీసుకొచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం.

– మోహన్‌రావు, మైన్ డీడీ

ఎండుతున్న వరి

- ఆందోళనలో రైతులు


మద్దువలస కాలువలో చుక్క నీరు లేని దృశ్యం


పాలఖండ్యాంలో బీటలు వారుతున్న వరిపొలం


పొట్టదశలో ఉన్న వరిచేను

జి.సిగడాం: రైతులు కష్టపడి పండించిన వరిపంట సాగునీరులేక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మద్దువలస రిజర్వాయర్ ద్వారా మండలంలోని ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. మద్దువలస కాలువ ద్వారా ఇంతవరకు మండలానికి చుక్క నీరు రాలేదు. వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, దవలపేట, పెంట, సీతంపేట, టి.డి.వలస, పాలఖండ్యాం, మెట్టవలస, నిద్దాం గ్రామాలకు ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ సాగునీరు చేరలేదు. గతంలో కురిసిన వర్షాల సమయంలో నాట్లు వేశారు. ప్రస్తుతం వరిచేను పొట్టదశలో ఉంది. ఈ సమయంలో నీరు లేకపోవడంతో పంట ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మద్దువలస కాలువ ద్వారా సాగునీరు అందించాలని కోరుతున్నారు. మరోపక్క వరుణ దేవుడు కరుణించాలని వేడుకుంటున్నారు.

కుప్పల తిప్పలు తప్పేదెన్నడో?


80 అడుగుల రోడ్డులో మట్టిదిబ్బలు


ఆఫీషియల్ కాలనీలో రోడ్డు మధ్యన ఇలా..

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేబుల్‌వైర్లు, టెలిఫోన్ లైన్లు, కుళాయి పైపుల మరమ్మతుల పేరిట రోడ్డును తవ్వేస్తూ.. పనులు పనులు పూర్తయ్యాక అలాగే వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల రోడ్డుపై మట్టి కుప్పలు వేసి పనులు పూర్తయినా తొలగించకపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో మట్టి దిబ్బలు వేసి వారాలు గడుస్తున్నా ఇంతవరకు తొలగించలేదు. కలెక్టర్ సహా జిల్లా అధికారులు నిరంతరం ఇటువైపుగా రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రి సమయాల్లో మట్టిదిబ్బలు గమనించకుండా అటువైపుగా వచ్చేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

వనమూలికా వైద్య శిబిరానికి స్పందన


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రామారావు

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వనమూలికా వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కె.ఎస్.వి.దుర్గారావు, కింతలి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. క్లబ్ సెంట్రల్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వనమూలికా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలా మొదటి, నాలుగో ఆదివారాలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైన వారు ముందుగా 9866075644 నంబరుకు సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కవిటి మండలం ముత్యాలపేటకు చెందిన వనమూలికా వైద్యుడు ఆర్.రామారావు మాట్లాడుతూ 35 ఏళ్లుగా వనమూలికలు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాని, కీళ్ల నొప్పులు, నడుంనొప్పి, వెన్నునొప్పి, నరాలు బలహీనత, సయాటికా, గ్యాస్ట్రిక్, ఫైల్స్ తదితర రోగాలకు చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో 30 మంది చికిత్స చేయించుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు యెరుకోల మురళీమోహనరావు, ఎం.ఎస్.మూర్తి, కె.వి.కామేశ్వరరావు, బి.భరత్‌భూషణరావు, బి.శ్రీరామ్మూర్తి, వరదా గోవిందరాజులు, పొట్నూరు రామారావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రణస్థలం: మండలంలోని చిల్లపేట రాజాం గ్రామ సమీప తోటల్లో ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురిని జె.ఆర్.పురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి రూ. నాలుగు వేలు నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి


సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని శని, ఆదివారాల్లో వందలాది మంది భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయ పరివార దేవతల్లో ఒకరైన దుర్గమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు నిర్వహించారు. అనివెట్టి మండపంలో పండితులు వేదపఠనం నిర్వహించారు.ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందించేలా ఆలయ ఈవో వై.భద్రాజీ చర్యలు చేపట్టారు. తలనీలాలను సమర్పించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

గ్రామీణ క్రీడలకు ఆదరణ పెరగాలి


కర్రసాము చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: గ్రామీణ క్రీడలకు మరింతగా ఆదరణ పెరగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. బూర శ్రీరాములు శివతాలింఖానా వ్యాయామశాల 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని ఎన్టీఆర్ఎం హైస్కూల్ మైదానంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కాసేపు కర్రసాము చేసి అలరించారు. ఈ సందర్భంగా బూర శ్యామ్‌సుందరరావు సుబ్రహ్మణ్యం, శంకర్ తదితరులు మాట్లాడుతూ శివతాలింఖానా వ్యాయామశాల ఘనతను వివరించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, ఏవీఎస్ ప్రసాద్, ఎ.సంతోష్‌కుమార్, గిరిధర్, నీలాద్రి, శ్రీధర్, పి.అంజనీకుమార్, వి.కాంతారావు, పి.భాగ్యచంద్రయాదవ్, బూర శ్రీరాములు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్నా పట్టించుకోరా?

- శిథిలావస్థలో మహిళా కళాశాల
- ఆందోళనలో విద్యార్థినులు


శిథిలావస్థకు చేరిన కళాశాల భవనాలు


పెచ్చులూడుతున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ప్రతిష్టాత్మకమైన శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 1968లో నిర్మితమైన ఈ కళాశాలలో అన్ని కోర్సులు కలిపి సుమారు 2 వేల మంది చదువుతున్నారు. ఎన్నో కోర్సులు మరెన్నో ప్రత్యేకతలు కలిగి.. నాక్ ఏ గ్రేడ్‌ను సొంతం చేసుకుని, నాలుగేళ్ల క్రితం స్వయం ప్రతిపత్తిని అందిపుచ్చుకున్న కళాశాల ప్రస్తుతం పెచ్చులూడుతోంది. పైకప్పుకు చిల్లులు పడ్డాయి. శ్లాబ్, స్లేడ్‌లు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. తరచూ మరమ్మతులు చేస్తున్నా కొన్నాళ్లకే పూర్వస్థితికి చేరుకుంటున్నాయి. ముఖ్యంగా వర్షం పడితే కళాశాల మొదటి అంతస్తుల్లో విద్యార్థినులు ఉండలేని పరిస్థితి నెలకొంది. ఎప్పటికప్పుడు పెచ్చులూడుతుండటంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాలకు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థిసంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముగిసిన దసరా సంబరాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఆలయాలు, మండపాలలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ఆఖరి అవతారంగా రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలతో పాటు ప్రస్తుత వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు.

అరసవల్లి: దసరా సంబరాలు ముగిశాయి. అరసవల్లిలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు రైతులు, ఇతర వర్గాల వారు సందడిగా జరుపుకొన్నారు. ఉదయం ఇళ్లల్లో దుర్గమ్మను కొలుస్తూ.. అఖండ దీపాల సాక్షిగా నవరాత్రుల పూజలు ముగించుకున్నాక శనివారం ఉదయం నుంచి గ్రామ దేవత అసిరితల్లి అమ్మవారి చెంత వందలాది మంది జనం ప్రత్యేక పూజార్చనలు నిర్వహించారు. భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రైతులంతా ఊడిక కొమ్ములు వేసి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో గరిడీలు, సంప్రదాయక నృత్యాలతో ఆనందోత్సవాల నడుమ పండగ జరుపుకున్నారు. గాయత్రి, కళ్యాణి, లావణ్య తదితర అమ్మాయిలు చేసిన కర్రసాము ఆకట్టుకుంది.


అరసవల్లి: ఇంద్రపుష్కరిణి ఒడ్డున ఆయుధపూజ


అరసవల్లి: అమ్మవారి ఆలయం వద్ద కొమ్ముల పండుగ


కర్రసాము చేస్తున్న అమ్మాయిలు


శ్రీకాకుళం కల్చరల్: రాజరాజేశ్వరిగా విజయదుర్గ


శ్రీకాకుళం కల్చరల్:రాజరాజేశ్వరిగా లలితాదేవి


శ్రీకాకుళం కల్చరల్:బలగలో బాలత్రిపుర సుందరి


శ్రీకాకుళం కల్చరల్:మొండేటివీధిలో అమ్మవారికి 75 రకాల పిండివంటలతో భోగం


శ్రీకాకుళం కల్చరల్:శ్రీకాంత్ బృందం ప్రదర్శన


రణస్థలం: జె.ఆర్.పురంలో అమ్మవారిని ఊరేగిస్తున్న భవానీభక్తులు


జి.సిగడాం: పెంట గ్రామంలో దుర్గమ్మకు సారెను తీసుకెళ్తున్న మహిళలు


ఎచ్చెర్ల క్యాంపస్: దేవీపీఠంలో పూజల్లో భక్తులు


గిరివానిపాలెంలో దుర్గాదేవి ఊరేగింపు

• అ'పూర్వ' సమ్మేళనం



మండలంలోని సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు.

శ్రీకాకుళం రూరల్

• ఆత్మీయ కలయిక



శ్రీకాకుళం: జి.సిగడాం జెడ్పీ ఉన్నత పాఠశాల 1980–85 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆత్మీయంగా కలిశారు. విద్యాబుద్ధులు నేర్పించిన అప్పటి ఉపాధ్యాయలు సీపీ నాయుడు, శ్రీరామ్మూర్తి, జగదాంబ తదితరులను ఘనంగా సత్కరించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి నిధులు సేకరిస్తామని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు డీఐపీఆర్ఓ డి.రమేష్, వీవీజీ శంకర్, మాడుగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.